క్లుప్తంగా

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న శాఖా గ్రంథాలయాధికారి రమణ

మునగపాక : విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక శాఖా గ్రంథాలయాధికారి ఎల్వీ రమణ కోరారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటువంటి శిక్షణ తరగతుల ద్వారా పిల్లల్లో మరింత విజ్ఞానం పెరుగుతుందన్నారు. జూన్ 7 తేదీతో శిక్షణ పూర్తవుతుందన్నారు. అదే రోజు విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

మంచి ప్రవర్తన, క్రమశిక్షణ అలవర్చుకోవాలి



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

రాంబిల్లి : విద్యార్థులు మంచి ప్రవర్తన, క్రమశిక్షణ అలవర్చుకోవాలని రీసోర్స్ పర్సన్స్ జి. నూకినాయుడు, వెంకటలక్ష్మి అన్నారు. దిమిలి శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో రీసోర్స్ పర్సన్స్ నీతికథలు చెప్పారు. క్రమశిక్షణ , సత్ప్రవర్తన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం పలు ఆటలను ఆడించారు. వేసవి శిక్షణతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని లైబ్రేరియన్ ఎస్.శకుంతల అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : పెదపల్లి 33/11కేవీ ఇండోర్ సబ్ స్టేషన్ 11కేవీ కొక్కిరాపల్లి పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి డివిజన్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి, పెదపల్లి గ్రామాల్లో గృహ వినియోగం, రాంనగర్, ఎర్రవరం వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

నేడు రెండో విడత చందన సమర్పణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దిబ్బవీధి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి రెండో విడత చందన సమర్పణ చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు శ్రీలక్ష్మి, ఆండాళ్ అమ్మవార్లకు పంచామృతాభిషేకం, పట్టుచీర అలంకరణ, 7 గంటలకు స్వర్ణ సంపెంగ పుష్పార్చన, సాయంత్రం 7 గంటలకు స్వామివారికి దీపాలంకరణ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

'రద్దీ వేళ రైళ్ల రద్దు తగదు'

అనకాపల్లి: వేసవి కాలంలో విద్యార్థులకు సెలవులు కావడంతో కుటుంబ సమేతంగా పుణ్యక్షేత్రాలు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో రద్దీకి అనుగుణంగా రైళ్ల సంఖ్యను పెంచాల్సింది పోయి, రైళ్లను రద్దు చేయడం అన్యాయమని కన్జ్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో ఆక్షేపించారు. ఈ విషయంపై రైల్వే బోర్డుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అత్యాధునిక వ్యవస్థ కలిగిన రైల్వేశాఖ ఏడాదిగా నిర్వహణ, ఆధునికీకరణ పేరిట డిమాండ్ ఉన్న రైళ్లను రద్దు చేస్తోందన్నారు. ప్రయాణికుల హక్కుల్ని కాలరాసేలా రైల్వే అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏ పనికైనా రైల్వే సిటిజన్ చార్టర్ ప్రకారం నిర్దేశిత గడువులోగా పూర్తి చేయకుండా, ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే అన్ని రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఆగిన సిగ్నల్.. మూగబోయిన సెల్‌ఫోన్లు

- 10 రోజులుగా 6 గ్రామాల ప్రజల అవస్థలు



రామచంద్రపురం జంక్షన్‌లోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

కోటవురట్ల : కొండల నడుమ ఉన్న ఆ గ్రామాలకు ఒక్కటే సెల్ టవర్. ఆ సెల్ టవర్ నుంచి సిగ్నల్ ఆగిందా వేలాది సెల్ ఫోన్లు మూగపోవాల్సిందే. ఇది ఎక్కడో ఏజెన్సీలోని మారుమూల గిరిజన ప్రాంతం అనుకుంటే పొరపాటే. సుమారు 10 రోజులుగా సెల్ ఫోన్లు పనిచేయక 6 గ్రామాల ప్రజలు పాత కాలం రోజుల్లోకి వెళ్లిపోయారు. కొందరైతే ప్రశాంతంగా ఉందని మౌనంగా ఉంటే యువకులు మాత్రం ఫోన్ చేతిలో ఉన్నా ఏం చేయలేక పిచ్చెక్కిపోతున్నారు. సెల్‌ఫోన్‌కు సిగ్నల్ వచ్చిందా లేదా అని మాటి మాటికీ ఫోన్ చూస్తున్నా సిగ్నల్ మాత్రం వచ్చే జాడ కనిపించలేదు. మండలంలోని రామచంద్రపురం జంక్షన్‌లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఉంది. ఈ టవర్ కింద రామచంద్రపురం, గూడెపులోవ, అల్లుమియ్యపాలెం, ములగల్లోవ, పందూరు, బంద గ్రామాలు ఉన్నాయి. ఈ టవర్ నుంచి సిగ్నల్ ఆదారంగానే మొబైల్ ఫోన్లు పనిచేస్తాయి. అయితే ఈ నెల 13న ఒక్కసారిగా టవర్ నుంచి సిగ్నల్స్ ఆగిపోయాయి. దాంతో వేలాది ఫోన్లు మూగబోయాయి. 10 రోజులు గడిచినా సిగ్నల్ రాకపోవడంతో ఈ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చవ్వాకుల చిన్న మాట్లాడుతూ నర్సీపట్నంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, సుమారు పది రోజులుగా ఫోన్‌లో బీఎస్ఎన్ఎల్ బ్యాలెన్స్ వేయించుకున్నవారు నష్ట పోయారని తెలిపారు. అధికారులు స్పందించి టవర్‌కు మరమ్మతు చేసి సిగ్నల్‌ను పునరుద్ధరించాలని కోరారు.

'వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం'



సమావేశంలో మాట్లాడుతున్న కంబాల జోగులు

ఎస్.రాయవరం : ఇటీవల జరిగిన ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గం, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఎస్.రాయవరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఇటీవల ఎన్నికల్లో తన గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. జూన్ 4న వచ్చే ఫలితాలు వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపుతాయన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు భూపతి అప్పారావు, కర్రి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, లక్కోజు ఆదిమూర్తి, కుర్రా కాశి, కర్రి కోటి,కర్రి పెదబ్బాయి పాల్గొన్నారు.

3న ఆలయ భూముల వేలం

మునగపాక : మండలంలోని ఒంపోలు సదానంద సోమేశ్వర స్వామి ఆలయ భూములకు జూన్ 3న వేలం పాట జరుగుతుందని ఆలయ ఈవో పీఎస్ఎస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయానికి చెందిన 5.40 ఎకరాల స్థలానికి సంబంధించి వేలం పాట జరుగుతుందన్నారు. 3వ తేదీన సాయంత్రం 4 గంటలకు జరిగే వేలం పాటను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేలం పాట దక్కించుకున్న వారికి 04-06-2024 నుంచి 03-06-2017 వరకు సాగు కాలపరిమితి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పాటదారులు సద్వినియోగం చేసుకోవాలని మూర్తి కోరారు.

విద్యార్థులకు యోగాతో ఆరోగ్యం



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులతో సూర్య నమస్కారం చేయిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు

పాయకరావుపేట : విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, యోగా, సూర్య నమస్కారం ఎంతో మంచి ఆరోగ్యమని విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.సీతారామమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం యోగా పై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థికీ క్రీడలు ఎంతో ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ మంచి నడవడిక, అలవాట్లు అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. అంతకుముందు వందేమాతరం గీతంతో కార్యక్రమం ప్రారంభించారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



మురకాడ ఆర్‌బీకే వద్ద పచ్చిరొట్ట విత్తనాల బస్తాలను పరిశీలిస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి : రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సి. సుమంత సూచించారు. బుధవారం ఆమె దిమిలి, మురకాడ, కట్టుబోలు ఆర్‌బీకేలను సందర్శించి జీలుగ, జనుము, పిల్లిపెసర పచ్చిరొట్ట విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. వీటిని 50 శాతం రాయితీపై అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు మేఘన, ప్రశాంతి, ఎంపీహెచ్‌వో రామారావు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆలయ జయంత్యుత్సవాలు



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అమ్మవారి ఆలయంలో శాంతిహోమం నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా వైశాఖమాసం పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రామనాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో నగర సంకీర్తన, గోపూజ, ప్రదక్షిణలు, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, నవకలశ స్నపనం, నీరాజన మంత్ర పుష్పములు, శాంతి హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అమ్మవారి ప్రతిష్ట శతజయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 50 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులతో వివిధ కంపెనీల ప్రతినిధులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఆదినారాయణ మహిళా కళాశాలలో బుధవారం జరిగిన జాబ్ మేళాలో 50 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కొణతాల అనూష తెలిపారు. విశాఖలోని మద్దిలపాలేనికి చెందిన మ్యాజిక్ బస్ ఇండియా టెలికాలర్ పోస్టుకు, అచ్యుతాపురం యకహోమా టైర్స్ కంపెనీతో పాటు, జాబ్ డీలర్ కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించినట్లు పేర్కొన్నారు. 90 పోస్టులకు జరిగిన ఇంటర్వ్యూలో 50 మంది ఎంపికైనట్లు వెల్లడించారు. రెండు రోజుల్లో నియామకపత్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు నాగచరణ్, రాజు, నేహ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి మొక్కలు సిద్ధం



పంపిణీకి సిద్ధమవుతున్న సరుగుడు నారు

- రైతులకు ఉచితంగా అందించనున్న అటవీశాఖ
- 3 వన నర్సరీల్లో పెంపకం
- వేసవిలో ఆరోగ్య సంరక్షణ చర్యలు

కె.కోటపాడు: అడపాదడపా వర్షాలు కురుస్తున్నా యి. ఈ తరుణంలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు రైతులు వివిధ కారణాలతో దీర్ఘకాలిక పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా మెట్ట భూముల్లో సరుగుడు, టేకు వంటి పంటలు వేస్తున్నారు. ఇటువంటి వారి కోసం మండలంలో కొత్త అగ్రహారం, రామచంద్రపురం, సింగన్నదొరపాలెం గ్రామాల్లో సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో వన నర్సరీలు పెంచుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో విరివిగా మొక్కల పెంపకాన్ని నిర్వహించడం ద్వారా వాతావరణ సమతుల్యత కల్పించేందుకు గాను సామాజిక అటవీ శాఖ అధికారులు నర్సరీల ద్వారా రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తుంటారు. ఇందుకు గాను పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, పంచాయతీ కార్యదర్శి సంతకంతో కూడిన దరఖాస్తు ఫాం సమర్పించాల్సి ఉంటుంది. వీటితోపాటు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటుతున్నారు. మరికొద్ది రోజుల్లోనే వాతావరణ పరిస్థితులు అనుకూలించి విస్తారంగా వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పై మూడు గ్రామాల్లోని వన నర్సరీల్లో మొక్కలను కలెక్టర్, డీఎఫ్‌వో ఆదేశాల మేరకు వచ్చే నెల రైతులకు పంపిణీ చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టనున్నారు. వేసవి దృష్ట్యా నర్సరీలలో పెంపకం చేస్తూ మొక్కలకు సకాలంలో నీటి తడులను అందిస్తూ ఆరోగ్యకరంగా ఉండేట ట్లు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు



మూడు గ్రామాల్లో వన నర్సరీలు నిర్వహిస్తున్నాం. ఖరీఫ్ వర్షాల సమయంలో రైతులు అధికంగా సరుగుడు, టేకు తదితర మొక్కలు నాటనున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలను అందించేందుకు నర్సరీలలో పెంచుతున్నాం. కలెక్టర్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఆదేశాలు వచ్చిన తర్వాత రైతులకు అందించనున్నాం.

– చిరికి గోవింద, వన సంరక్షకుడు, కొత్త అగ్రహారం

మోదమాంబకు కుంకుమ పూజలు



మోదమాంబకు పూజలు చేస్తున్న అర్చకుడు

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు స్వగృహంలో ఏర్పాటు చేసిన మోదమాంబ అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామంలో అమ్మవారి మాలాధారణ భక్తుల ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

రైతులకు అండగా అగ్రి ల్యాబ్



మాడుగులలో నూతనంగా నిర్మించిన అగ్రి ల్యాబ్ భవనం

మాడుగుల: నియోజకవర్గానికి ఒక అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేయడం వల్ల పాడి రైతులకు వరంగా మారింది. పశు వ్యాధులకు సకాలంలో రక్త, పేడ, పొదుగు వాపు, పారుడు వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వెంటనే మందులు అందజేస్తున్నారు. దీనివల్ల వ్యాధులు నయం కావడంతోపాటు పాల దిగుబడి పెరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ సేవలు పొందాలంటే విశాఖకు శాంపిల్స్ పంపించి తిరిగి వచ్చేసరికి వ్యాధులు ముదిరి మృత్యువాత పడేవి. నేడు అగ్రిల్యాబ్‌లు అందుబాటులోకి రావడంతో పశువులకు సకాలంలో వైద్యం అందుతోంది. ప్రతి నెలా 500 పశువులకు పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని, యాంటీ బయోటిక్ మందులు అధికంగా వాడకుండా అవసరమైన మోతాదులో చికిత్స చేస్తున్నామని ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు.

మా కళాశాలలో చేర్పించండి..

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల ప్రచారం



రామచంద్రపాలెంలో విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని వివరిస్తున్న లెక్చరర్లు

కోటవురట్ల: నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.. నిష్ణాతులైన అధ్యాపకులు విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకుంటున్నారు..మీ పిల్లలను మా కళాశాలలో చేర్పించండి అంటూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇంటిబాట పట్టారు. విద్యార్థుల ఇళ్లను సందర్శించి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లభిస్తున్న విద్యా సేవలను వివరిస్తున్నారు. ప్రైవేటు కళాశాలలు విపరీతంగా పెరిగిపోయాయి. పోటీతత్వం పెరిగిపోయింది. దాంతో పేదలు సైతం కార్పొరేట్ కళాశాలలపై మోజుతో రూ.లక్షలు వదిలించుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలలో అధునాతన భవనాలు, నిష్ణాతులైన అధ్యాపకులతో మెరుగైన విద్యా బోధన ఉన్నప్పటికీ ప్రైవేటు మోజుతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. దాంతో లెక్చరర్లే విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని మీ పిల్లలను మా కళాశాలలో చేర్పండి..వారికి మంచి విద్యను అందించి ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత మాదంటూ వివరిస్తున్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా మెరుగైన విద్యను అందిస్తోందని అవగాహన కల్పిస్తున్నారు.

144 సెక్షన్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న నర్సీపట్నం డీఎస్పీ మోహన్

ఎస్.రాయవరం: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కవ్వింపులకు ప్రగల్భాలకు తావులేకుండా ప్రజలు ప్రశాంతంగా ఉండాలని నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్ మోహన్ అన్నారు. దార్లపూడి, రేవుపోలవరం గ్రామాల్లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ ముగిసిందని, జూన్ 4 న దేశవ్యాప్తంగా కౌంటింగ్ ఉంటుందని అంతవరకు గ్రామాల్లో శాంతి భద్రతలను ఎటువంటి విఘాతం లేకుండా ప్రజలు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా 144 సెక్షన్‌పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో నక్కపలి సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

గోవిందపాలెంలో కార్డన్ అండ్ సెర్చ్



గోవిందపాలెంలో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

రాంబిల్లి : గోవిందపాలెంలో బుధవారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి రికార్డులు లేని 20 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటోను సీజ్ చేసారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని సీఐ పేర్కొన్నారు. ఎటువంటి అల్లర్లు, గొడవలు, తగాదాల జోలికి పోవద్దని హితవు పలికారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు



ఆర్వో గీతాంజలి

నక్కపల్లి : పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్లు లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని రిటర్నింగ్ అధికారి గీతాంజలి తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మొత్తం 22 రౌంట్లు లెక్కింపు వుంటుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్లతో కలిపి మొత్తం 22 రౌండ్లు వుంటాయన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ కోసం రెండు టేబుళ్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. లేదా 500 ఓట్లకు ఒక టేబుల్ ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో 2111 పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు పోలైనట్లు ఆమె చెప్పారు. నియోజకవర్గంలో 2 లక్షల 50 వేల 744 ఓట్లు ఉండగా, 2 లక్షల 6 వేల 626 ఓట్లు పోలైనట్టు చెప్పారు. 292 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 14 టేబుళ్ల 22 రౌండ్లలో లెక్కింపు వుంటుందని తెలిపారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో లెక్కింపు కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

పోలీస్ స్టేషన్‌కు స్టాప్ బోర్డుల అందజేత



స్టాప్ బోర్డులతో కశింకోట సీఐ వినద్‌బాబు, రామ్‌కో సిమెంట్ ప్రతినిధులు

కశింకోట: స్థానిక పోలీస్ స్టేషన్‌కు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ 50 స్టాప్ బోర్డులను సమకూర్చినట్లు సీఐ ఎం.వినోద్‌బాబు బుధవారం మీడియాకు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ఉపకరించే విధంగా రూ.3.50 లక్షలు వెచ్చించి వీటిని అందించారన్నారు. అనకాపల్లి డీఎస్పీ కార్యాలయానికి కూడా మరో 75 స్టాప్ బోర్డులు అందించినట్లు పేర్కొన్నారు. ఇందుకు పరిశ్రమ యాజమాన్యాన్ని, నిర్వాహకులను ఆయన అభినందించారు.

కార్యక్రమంలో మండలంలోని ఏఎస్ పేట వద్దనున్న సిమెంట్ పరిశ్రమ హెడ్ పి.వీరపాండ్యన్, ఎం.కళాధర్, హెచ్ఆర్ మేనేజర్ ఎం.యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



దేవరాపల్లిలో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



చౌడువాడలో పుస్తక పఠన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి

దేవరాపల్లి: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి ఓ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

కె. కోటపాడు: వేసవి శిక్షణ తరగతులతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని గ్రంథపాలకురాలు ఎం. పద్మావతి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటపాటలతోపాటు చదువుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.